క్లుప్తంగా

'గండ్ర'ను కలిసిన నాయకులు



శాయంపేట : భూపాలపల్లి ఎమ్మెల్యేగా గెలుపొందిన గండ్ర సత్యనారాయణరావును మండలంలోని కాంగ్రెస్ నాయకులు శుక్రవారం హనుమకొండలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి పులబొకే అందించారు. మాజీ జెడ్పీటీసీ చక్రపాణి, పరకాల ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పెద్దకోడెపాక సర్పంచ్ ప్రకాష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి రవీందర్, నాయకులు భాస్కర్, రమేష్, కృష్ణమూర్తి, ప్రకాష్, శంకర్, అమరేందర్‌రెడ్డి, వేణు, శ్రీనివాస్, నాగరాజు, విష్ణు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఉద్యమకారుడికి 'అరూరి' నివాళి



ఐనవోలు: మండలంలోని కక్కిరాలపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, ఉద్యమకారుడు కాత నాగయ్య(55) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి శుక్రవారం నాగయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీలు శ్రీరాములు, భిక్షపతి, ఎంపీపీ మధుమతి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు సంపత్‌కుమార్, సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ రమేష్, మండల అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, కార్యదర్శి రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



దామెర: జాతీయస్థాయి కుస్తీ పోటీలకు మండలంలోని తక్కళ్లపహడ్ గ్రామానికి చెందిన సీహెచ్ ప్రీతం ఎంపికయ్యారు. గత నెల 25వ తేదీన జేఎస్ఎస్‌లో జరిగిన యునివర్సిటీ స్థాయి, పంజాబ్‌లో జరిగిన సౌత్‌వెస్ట్ 60 కిలోల విభాగం కుస్తీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కాగా ప్రీతమ్‌ను, కోచ్ రాజును గ్రామ సర్పంచ్ రాజేందర్, వార్డు సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

రేవూరిని కలిసిన నాయకులు



నడికూడ: ఎమ్మెల్యేగా గెలుపొందిన రేవూరి ప్రకాష్‌రెడ్డిని మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండలోని ఆయన నివాసంలో ఆపార్టీ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్, రాయపర్తి మాజీ సర్పంచ్ కడారి సమ్మయ్య, మల్లారెడ్డి, యూత్ అధ్యక్షుడు అప్పం కుమారస్వామితో పాటు తదితరులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

పరామర్శ

ఆత్మకూరు: మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పరికిరాల సౌందర్య కుటుంబాన్ని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పరామర్శించారు. మృతురాలి కుమారుడు మాజీ ఎంపీటీసీ పరికిరాల వాసుతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సర్పంచ్ పర్వతగిరి రాజు, గ్రామ అధ్యక్షుడు బయ్య కుమారస్వామి, పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్, డైరెక్టర్ రేవూరి జయపాల్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

కేయూ క్యాంపస్: హైదరాబాద్‌లో ఈనెల 4నుంచి 6వ తేదీ వరకు మ్యాగ్నటిక్ సొసైటీ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో కాకతీయ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల (కోఎడ్యుకేషన్) కాంట్రాక్టు అధ్యాపకుడు సాయిమనీష్ పాల్గొని పోస్టర్‌ను ప్రజెంటేషన్ చేసి ప్రతిభ కనబరిచారు. ఈమేరకు అతడు బెస్ట్‌పోస్టర్ అవార్డులో ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. కాకతీయ యూనివర్సిటీలో అతనిని వీసీ తాటికొండ రమేష్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మల్లారెడ్డి శుక్రవారం అభినందించారు.

బాలాజీకి డాక్టరేట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పొలిటికల్ సైన్స్ విభాగం పరిశోధకుడు లకావత్ బాలాజీకి యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. పర్‌ఫార్మెన్స్ ఆఫ్ మోడల్ స్కూల్స్ ఇన్ తెలంగాణ స్టేట్ ఏ కేస్ స్టడీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి బాలాజీకి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు.

నేడు కిట్స్‌లో గ్రాడ్యుయేషన్ డే

హసన్‌పర్తి: నగరంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు. కళాశాల ప్రాంగణంలో ఉదయం 10గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు.

వేలాడుతున్న మృత్యుపాశాలు

- పొలాలకు వెళ్లే దారిలో చేతికి అందే ఎత్తులో విద్యుత్ తీగలు
- రైతులకు పొంచి ఉన్న ప్రమాదం
- పట్టించుకోని విద్యుత్‌శాఖ అధికారులు



విద్యుత్ తీగలు కిందికి వేలాడుతుండటంతో కర్రలు పాతి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకున్న రైతులు

ఐనవోలు: తగిలితే వదలని విద్యుత్ మృత్యు పాశాలు వేలాడుతున్నాయి. పొలాల్లోని బోరు బావులకు వెళ్లే విద్యుత్ తీగలు కిందకి వేలాతూ ప్రమాదకరంగా కనిపిస్తున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. మండలంలోని కొండపర్తి శివారు భట్టుపల్లికి వెళ్లే దారిలో వ్యవసాయ బావులకు వెళ్లే విద్యుత్ తీగలు వేలాడుతూ ఉండటంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. విద్యుత్‌శాఖ లైన్‌మన్ నుంచి ఏడీఏ వరకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

సమస్య ఏమిటంటే..?

కొండపర్తి సబ్‌స్టేషన్ ఎస్ఎస్4 ఇంప్రూవ్‌మెంట్ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో విద్యుత్ స్తంభాలు సరిపడా లేకపోవడంతో తీగలు వేలాడుతున్నాయి. అదే విధంగా పలు చోట్ల విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకుని కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. మరొకొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలకు సపోర్టు తీగలు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ తీగలు వేలాడుతుండటంతో రైతులు విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉందని వాటిని సరిచేయాలని అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. కానీ ఇప్పటి వరకు అధికారుల పట్టించుకోలేదని, దాంతో కర్రలు పాతి తాత్కాలిక ఏర్పాట్లు చేసి నెట్టుకొస్తున్నామని రైతులు తెలిపారు. శాశ్వత పరిష్కారం కొరకు మిడిల్ పోళ్లు ఏర్పాటు చేసి విద్యుత్ తీగలు కిందకు వేలాడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే విద్యుత్ తీగలు వేలాడే ప్రాంతం బండ ప్రాంతమని, మిడిల్ పోళ్లు వేసేందుకే సాధ్యం కాదని అధికారులు వెల్లడించారు. పోళ్లు వేయడం సాధ్యం కాని పక్షంలో లైన్ షిఫ్ట్ చేసి ప్రత్యామ్నాయ మార్గంలో విద్యుత్ సరఫరా చేయాలని రైతులు కోరారు. గతంలో ధాన్యం లోడ్ చేస్తున్న క్రమంలో తృటిలో ప్రమాదం తప్పిందని అన్నారు. తీగలు వేలాడుతున్నాయని అధికారులకు విన్నవించినా పెడి చెవిన పెడుతున్నారని, రైతుల ప్రాణాలకు హాని కలిగితే విద్యుత్‌శాఖ అధికారులు బాధ్యత వహిస్తారా అని ప్రశ్నిస్తున్నారు.



శిథిలమైన విద్యుత్ స్తంభం

పట్టించుకోవడం లేదు



కొండపర్తి శివారులో వ్యవసాయ బావులకు పోయే విద్యుత్ లైన్ ప్రమాదకరంగా ఉంది. తీగలు మనిషికి తగిలే విధంగా వేలాడుతున్నాయి. అధికారులు స్పందించకపోవడంతో కర్రలు ఏర్పాటు చేసుకున్నాం. విద్యుత్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. తక్షణమే మిడిల్ పోళ్లు లేదా లైన్ మార్చడం కాని చేయాలి. లేనిపక్షంలో రైతులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది.

- కట్కూరి రాజు, రైతు, కొండపర్తి

శిథిలావస్థకు చేరాయి



నా సొంత పొలంలో విద్యుత్ పోల్ శిథిలావస్థకు చేరుకుని కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది. అటు వైపుగా వెళ్లాలంటే భయంగా ఉంటుంది. ఎప్పుడు కూలిపోయి మీదపడుతుందోనని బిక్కు బిక్కుమంటూ పొలం వద్ద గడపాల్సి వస్తుంది. కూలి పోయేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ పోళ్లను మార్చి నూతన పోల్ ఏర్పాటు చేయాలి. సపోర్టు తీగలు లేని పోళ్లకు తీగలు ఏర్పాటు చేసి రైతులు ప్రమాదానికి గురికాకుండా చర్యలు తీసుకోవాలి. స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు కూడా పట్టించుకోవడం లేదు. ఇటువైపు వస్తే చూస్తూ వెళ్లేరే తప్ప సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేయడం లేదు. ఇప్పటికైనా పట్టించుకొని న్యాయం చేయాలి.

- నీరటి రాంబాబు, రైతు, కొండపర్తి

నేడు సర్వసభ్య సమావేశం

ఎల్కతుర్తి: నేడు భీమదేవరపల్లి మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మండల ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు పూర్తి నివేదికలతో సమావేశానికి సకాలంలో హాజరు కావాలని కోరారు. మండల అభివృద్ధి కోసం నిర్వహించే సమావేశంలో ప్రతిఒక్క అధికారి పాల్గొని గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, పరిష్కరించిన వాటిని సభకు తెలియజేయాలని సూచించారు.

ఆలయంలో అన్నదానం



పరకాల: కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని శ్రీకుంకుమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సంపత్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణచారి దంపతులు భక్తులకు మహా అన్నదానం చేశారు. సాయంత్రం ఆకాశదీపోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఈఓ వెంకటయ్య, ఆలయ ప్రధాన అర్చకుడు నాగభూషణంశర్మ, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను బాల మేధావులుగా తీర్చిదిద్దాలి



డ్రాయింగ్ చార్ట్‌లను చూపిస్తున్న విద్యార్థులు

శాయంపేట : బాలలలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి బాలమేధావులుగా తీర్చిదిద్దాలని యూనిట్ మేనేజర్ ప్రియాంకరెడ్డి అన్నారు. మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఆర్థిక సాయంతో ఎఫ్‌పీసీఎల్ బీసీఐ ప్రాజెక్టు ద్వారా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 14సంవత్సరాల్లోపు పిల్లలతో పనులు చేయించొద్దని అన్నారు. విద్యార్థులను విద్యకు దూరం చేసి పనులు చేయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. పురుగు మందు పిచికారి చేసేటప్పుడు చిన్న పిల్లలు పంట పొలాల్లో ఉండొద్దని, పురుగుమందు డబ్బాలకు దూరంగా ఉంచాలని సూచించారు. అనంతరం బాల, బాలికలకు స్టాఫ్ చైల్డ్ లేబర్ అనే కన్సెప్ట్ పై డ్రాయింగ్ కాంపిటీషన్ నిర్వహించారు. విజేతలకు డిక్షనరీ, స్పోకెన్ ఇంగ్లిష్ బుక్కులు, నోట్ బుక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కర్ణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు భాస్కర్, విజయ్, శారద, వసంత, ఫీల్డ్ ఫెసిలిటర్లు కుక్కల కల్పన, పోతు సునీల్, తిరుపతి పాల్గొన్నారు.

రాష్ట్ర ఖజానాను లూటీ చేసిన కేసీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

శాయంపేట : తెలంగాణ రాష్ట్ర ఖజానాను బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ లూటీ చేశారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు విమర్శించారు. మండలంలోని కొప్పుల, మైలారం గ్రామాల్లో ఓ వేడుకకు హాజరై అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తుందన్నారు. నేడు మధ్యాహ్నం 2గంటలకు ఆర్టీసీ బస్సులో ప్రయాణం, 10లక్షలతో ఆరోగ్యశ్రీ రెండు గ్యారెంటీ పథకాలను అమలు కానున్నాయని పేర్కొన్నారు. మండలంలోని వాగవతలి గ్రామాలైన సాధోనిపల్లి, రాజుపల్లి గంగిరేణిగూడెం గ్రామాల్లో ఆర్టీసీ సర్వీస్ కల్పించేందుకు రీజినల్ మేనేజర్‌తో మాట్లాడినట్లు తెలిపారు.

ఆగని మొరం అక్రమ రవాణా



అనుమతులు లేకుండా ట్రాక్టర్ల ద్వారా మొరం రవాణా చేస్తున్న అక్రమార్కులు

వేలేరు : మండలంలో మొరం అక్రమ రవాణా ఆగడం లేదు. కొందరు నాయకులు అక్రమార్కులతో కలిసి ధనార్జనే ధ్యేయంగా పట్టా, ప్రభుత్వ భూముల్లోని మొరాన్ని తరలిస్తున్నారు. భూమిని చదును చేసి ఇస్తామనే సాకుతో రైతులకు మాయ మాటలు చెప్పి వారి భూముల్లోంచి మొరం తరలిస్తూ విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని మల్లికుదుర్ల, వేలేరుతో పాటు పలు గ్రామాల్లో యథేచ్ఛగా మొరం తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎమ్మెల్యే కడియం వ్యాఖ్యలు సిగ్గుచేటు



మాట్లాడుతున్న బొల్లెడ్ల వికాస్‌రెడ్డి

ధర్మసాగర్: ప్రజలు ఎన్నుకున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చుతామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లెడ్ల వికాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దపెండ్యాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోతులు తవ్వే స్వభావాన్ని కడియం శ్రీహరి ఇప్పటికైనా మానుకోవాలని హితవు పలికారు. గతంలో దివంగత నేత ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని పడగొట్టడంలో కూడా కడియం పాత్ర పోషించారని విమర్శించారు. బీజేపీతో కలుపుకొని 54 సీట్లు ఉన్నాయని అనడంతో బీజేపీతో బీఆర్ఎస్‌కు ఉన్న లోపాయికారి ఒప్పందం బయటపడిందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాకపోవడంతో ఆపార్టీ నాయకులు నోటికి వచ్చింది మాట్లాడుతున్నారని, నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు. మండల కోఆర్డినేటర్ కొత్తపల్లి భిక్షపతి, విజయ్‌రెడ్డి, ప్రవీణ్, సురేష్, చింటూ, అభిషేక్, నేరేల శివ పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని కూలుస్తామనడం శోచనీయం

ప్రజాస్వామ్య బద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాన్ని కూల్చేందుకు కడియం శ్రీహరి ఎంతటికైనా దిగజారుతారా అని జన పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొడ్డు భరత్ ప్రశ్నించారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తెలంగాణలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఆరు నెలల్లో కూలిపోతుందని వ్యాఖ్యానించడం సరికాదన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజలు మార్పు కోరుకుని కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారని, బాధ్యతగల శాసన సభ్యుడి హోదాలో ఉండి అలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఇప్పటికై నా కుట్రలు మానుకుని ప్రభుత్వానికి, ప్రజలకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ప్రభాకర్, రవీందర్, వేణుగోపాల్, కార్తీక్ పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా ప్రభుత్వ పాఠశాల



దామెర: మండలంలోని పులుకుర్తి ప్రాథమిక పాఠశాల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. రాత్రి సమయాల్లో మందుబాబులు పాఠశాలను అడ్డాగా మార్చుకొని యథేచ్ఛగా మద్యం సేవిస్తున్నారు. తాగి పడేసిన మద్యం సీసాలు, బిర్యానీ ప్యాకెట్లు, గ్లాసులు, సిగరెట్ పీకలు, గుట్కా ప్యాకెట్లు పాఠశాలలోనే వదిలేసి వెళుతున్నారు. దీంతో ఉదయం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలను శుభ్రం చేసుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. గత కొంత కాలంగా పాఠశాల ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తులు మద్యం సేవించి తరగతి గదుల ముందు అపరిశుభ్రంగా మారుస్తున్నారని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. గ్రామ పంచాయతీ పాలకమండలి చర్యలు తీసుకోవాలని కోరారు.

సఖి కేంద్రాన్ని వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీదేవి

శాయంపేట : సఖి కేంద్రం అందించే సేవలను మహిళలు వినియోగించుకోవాలని సఖి టీం లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి వన్ స్టాప్ కేంద్రంపై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడారు. హింసకు గురవుతున్న చిన్న పిల్లలకు, మహిళలకు సఖి కేంద్రం అండగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలకు తమ సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 181, ఫోన్ నెంబర్ 0870–2452112కు ఫోన్ చేయాలన్నారు. ఏపీఎం శ్రీధర్ రెడ్డి, కేసు వర్కర్ వినీల మహిళలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



ధర్మసాగర్ : రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

ధర్మసాగర్: మండలంలోని పెద్దపెండ్యాల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం బత్తిని రాజేందర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 06న కాజీపేటలోని సెయింట్ గాబ్రియల్ గ్రేండ్‌లో జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్ 17లో బాల, బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో ఆర్ సాకేత్, ఎం మల్లికార్జున్, పి లక్ష్మి, సిహెచ్ శ్వేత, జి అభినవవర్షిని, వై అక్షయ ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 8,9,10 వ తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల మండలం బాదేపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులను, పీఈటీ సుధాకర్‌ను సర్పంచ్ ఆకారపు అన్నమ్మ, ఎంపీటీసీ నాగయ్య, మాజీ సర్పంచ్ తోట స్రవంతి, నాగరాజు, ఉప సర్పంచ్ శివాకర్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ మామిడాల కిషోర్, బత్తిని రాజ్‌కుమార్, సోమ అమర్నాథ్, పీఎస్ హెచ్ఎం చాడ మల్లారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు ఎంపికైనట్లు పీఈటీ కరిత శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సాయిశ్రుతి, లహరి, సానియాకౌశ్ర, అర్పిత ఎంపికై నట్లు తెలిపారు. విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించాలని సూచించారు.

గోవులను సంరక్షించుకోవాలి

వేలేరు : గోవుల సంరక్షణతోనే రైతులకు మనుగడని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ అన్నారు. మండలంలోని లోక్యతండాలో శుక్రవారం శివశంకర్ గోశాల ఆధ్వర్యంలో 10 మంది రైతులకు ఉచితంగా 20 కొడె దూడలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గో సంపద రోజురోజుకు తగ్గిపోతుందని, దీంతో రైతులకు కూడా ఇబ్బందేనని అన్నారు. అధిక రసాయన ఎరువుల వాడకంతో భూసారం, పంట దిగుబడి తగ్గుతుందని అన్నారు. గోవుల పెంపకంతో ఆవుపేడ, గో మూత్రంతో సేంద్రియ వ్యవసాయం చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మురావత్ అనురాధ లింగం, గోశాల సూపరిండెంట్ దుర్గం రోజా, గోశాల కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎల్కతుర్తి: కాంగ్రెస్ పార్టీ హుస్నాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందిన పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు మంత్రి పదవి దక్కడంతో ఆపార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సామాజిక సేవకురాలు, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు మంజులారెడ్డి శుక్రవారం భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో 101కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. కాంగ్రెస్ పాలనలో మండల ప్రజలు సుఖశాంతులతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్‌కు ఓటు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆమె వెంట సమ్మయ్య, సంపత్, సురేష్, చారి తదితరుల ఉన్నారు.



అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్‌శాతం పెంచుకున్నాం



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పరకాల: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూసినప్పటికీ ఓటింగ్ శాతం పెంచుకున్నామని బీజేపీ నాయకులు అన్నారు. బీజేపీకి ఓటింగ్ పెరగడంతోనే బీఆర్ఎస్ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి పరాజయం చెందాడని అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి మాట్లాడారు. బీజేపీ ప్రయోజకరమైన సంక్షేమ పథకాలనే మేనిఫెస్టోలో పొందుపరిచికప్పటికీ ప్రజలలోకి తీసుకెళ్లడంలో తాము వైఫల్యం చెందామన్నారు. కాంగ్రెస్ తన మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో సఫలమైందన్నారు. అంతే కాకుండా కేసీఆర్‌పై కోపంతో ఆపార్టీకి ప్రజలు పట్టం కట్టారన్నారు. ఆకర్షణీయమైన వాగ్దానాలు చేసిన కొత్త ప్రభుత్వం హామీలన్ని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఓటమిపై విశ్లేషణ చేసుకొని వచ్చే స్థానిక సంస్థలు, పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధిస్తామన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, సిరంగి సంతోష్‌కుమార్, పగడాల కాశీప్రసాద్‌రావు, కన్నబోయిన రాజయ్య, సాంబయ్య, ఆర్‌పీ జయంత్‌లాల్, వెంకటస్వామి, రాజవీర్, రాజిరెడ్డి, నిరంజన్, విజయ్‌కుమార్, పురుషోత్తం పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడితే క్రిమినల్ కేసులు



శాయంపేట : ప్రకృతిలో స్వేచ్ఛగా జీవించే వన్యప్రాణులను వేటాడితే చట్టపరంగా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మైసయ్య హెచ్చరించారు. ఐఎఫ్ఎస్ లావణ్య, ఎఫ్ఆర్ఓ భిక్షపతి ఆదేశాల మేరకు మండలంలోని శాయంపేట, పత్తిపాక గ్రామాల్లోని పాత నేరస్తుల ఇళ్లలో స్నేర్స్ డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం ఫారెస్ట్ అధికారులు ఆకస్మికంగా సోదాలు చేశారు. పక్షులు, జంతువులను వేటాడానికి వినియోగించే జాలీలు, వలలు, ఉచ్చులను స్వాధీనం చేసుకొని హనుమకొండలోని అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. వేటగాళ్లు తమ ఇళ్లలో వన్యప్రాణులను వేటాడేందుకు వినియోగించే వలలు ఉచ్చులు పాతవైనప్పటికీ ఇళ్లలో ఉంచుకోకూడదని అన్నారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌లు రతన్లాల్, బండి బలరాం, పాడెం సుగుణ పాల్గొన్నారు.